క్లుప్తంగా

ఆర్థిక సాయం

అడ్డాకుల: మండల కేంద్రానికి చెందిన బోయ మన్నెం అనారోగ్యానికి గురై మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్‌ నాయకులు బుధవారం పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం జెడ్పీటీసీ సభ్యుడు ఎస్‌.రాజశేఖర్‌రెడ్డి రూ.10వేలును పంపించడంతో వాటిని స్థానిక నాయకులు బాధిత కుటుంబానికి అందించారు. ఖాజాఫోరీ, శ్రీనివాస్‌ యాదవ్‌, కురుమూర్తి, కేశన్న, రాములు, కిన్నెర దానేలు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్‌ పట్టివేత

అడ్డాకుల: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ మన్నెం తెలిపారు. గ్రామానికి చెందిన మన్నెంకొండ ట్రాక్టర్‌లో బుధవారం తెల్లవారుజామున అనుమతి స్థానిక వాగు నుంచి ఇసుకను తరలిసుండగా రెవెన్యూ అధికారులకు సమాచారం అందడంతో శాఖాపూర్‌ వీఆర్‌ఏ రాజశేఖర్‌ గుడిబండకు వెళ్లి పట్టుకున్నట్లు వివరించారు. తహసీల్దార్‌ కిషన్‌ అక్కడికి వెళ్లి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను పోలీసులకు అప్పగించారని, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవాబుపేట : మండల పరిధిలోని లోకిరేవులో బుధవారం ఎంపీ మన్నెశ్రీనివాస్‌ రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు సూచించారు. జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్‌ నర్సింహులు, మార్కెట్‌ చైర్మన్‌ లక్ష్మయ్య, ఎంపీపీ అనంతయ్య, రైతు బంధు చైర్మన్‌ మధుసూదన్‌రెడ్డి, వైస్‌ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, ముడా డైరెక్టర్‌ చెన్నయ్య, రాంప్రసాద్‌, గోపాల్‌గౌడ్‌, శ్రీనివాస్‌, ప్రతాప్‌ పాల్గొన్నారు.

ఆత్మగౌరవ భవనాలు నిర్మించాలి

స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: రాష్ట్రంలో ముస్లింల (బీసీ–ఈ)కు ఆత్మగౌరవ భవనాలు నిర్మించాలని ఆల్‌ మైనార్టీ ఎంప్లాయిస్‌ వర్కర్స్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎండి.ఇఫ్రత్‌అలీ, మహ్మద్‌ అయూబ్‌ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్‌ చేశారు. రాష్ట్రంలోని బీసీ ఉపకులాలన్నింటికీ ఆత్మగౌరవ భవనాలు నిర్మిస్తున్న సీఎం కేసీఆర్‌ బీసీ–ఈలోని ముస్లిం కులాలకు కూడా భవనాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

యువతి అదృశ్యం : కేసునమోదు

అడ్డాకుల: మండలంలోని కందూర్‌ గ్రామానికి చెందిన హనుమంతు కుమార్తె రాములమ్మ(19) కనిపించకుండా పోయినట్లు ఏఎస్‌ఐ మన్నెం తెలిపారు. గొర్రెలు మేపడానికి వెళ్లే రాములమ్మ మంగళవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చిందని తరువాత ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయిందన్నారు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె బావ మల్లేష్‌ బుధవారం అడ్డాకుల ఠాణాలో ఫిర్యాదు చేశాడని వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించాడు.

మహమ్మదాబాద్‌: ఓ మహిళ అదృశ్యమైన ఘటన గండేడ్‌ మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. రుసుంపల్లి వడ్డెగుడిసెలు కి చెందిన వల్లెపు మంగమ్మ (35) మంగళవారం కూలీపనికోసం ఇంటి నుంచి వెళ్లి రాత్రి అయినా తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బుధవారం గ్రామంలో, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె కుమారుడు శ్రీకాంత్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదయ్య తెలిపారు.

గ్రామీణ క్రీడాకారులకు వరం


చిన్నచింతకుంటలో..


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

నవాబుపేట: ప్రతి పల్లెలో క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేసి గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం అందించడంతో పాటు, వారి ప్రతిభను గుర్తించేందుకే సీఎం కప్‌ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో సీఎంకప్‌ ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు, నగదు అందజేశారు.

మహబూబ్‌నగర్‌ క్రీడలు: సీఎంకప్‌ పోటీల్లో సత్తా చాటిన ఖోఖో క్రీడాకారులను జిల్లాస్థాయికి బుధవారం ఎంపిక చేశారు. కార్యక్రమంలో పీడీ యూ.శ్రీనివాసులు, పీఈటీ బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు. ఎంపికైన జట్టులో అనిత, వరలక్ష్మి, శ్రావణి, మమత, శ్రీవాణి, సంధ్య, నందిని, బి.నందిని, వాణిశ్రీ, జె.నందిని ఉన్నారు.

రాజాపూర్‌ : డీసీఎంఎస్‌ చైర్మన్‌ ప్రభాకర్‌రెడ్డి సీఎం కప్‌ పోటీల ముంగిపు కార్యక్రమానికి బుధవారం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను నిరంతరం ప్రోత్సహిస్తోందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఎంపీపీ సుశీల, ఎంపీడీఓ లక్ష్మీదేవి, ఎంపీఓ వెంకట్‌రాములు, ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి, వైస్‌ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, ముడా డైరెక్టర్‌ శ్రీశైలంయాదవ్‌ పాల్గొన్నారు.

అడ్డాకుల: మూసాపేట, అడ్డాకుల మండల కేంద్రాల్లో నాయకులు, అధికారులు విజేతలకు బహుమతులను అందజేశారు. ఎంపీపీలు నాగార్జున్‌రెడ్డి, కళావతి, తహసీల్దార్‌ కిషన్‌, ఎంపీడీఓలు మంజుల, స్వరూప, ఎస్‌ఐ విజయ భాస్కర్‌, స్నేహ పరిశ్రమ నిర్వాహకులు రామేశ్వర్‌రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

మిడ్జిల్‌: ఎంపీపీ సుదర్శన్‌, జెడ్పీటీసీ శశిరేఖ సీఎం కప్‌ విజేతలకు బుధవారం బహుమతులు అందజేశారు. తహసీల్దార్‌ రాజీవ్‌రెడ్డి, ఎంపీడీఓ సాయిలక్ష్మి, సర్పంచ్‌ రాధికవెంకట్‌రెడ్డి, మల్లయ్య, గోపాల్‌, జగన్‌, పరుశరాములు పాల్గొన్నారు.

గండేడ్‌: మండలకేంద్రంలో విజేతలకు జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. మండల ప్రత్యేకాధికారి సాయిప్రసాద్‌, ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ విశ్వరాయగౌడ్‌, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ గోపాల్‌రెడ్డి, సర్పంచ్‌ చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్‌: జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం విజయం సాధించిన జట్లకు బహుమతులను అందించారు. ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి, తహసీల్దార్‌ ఆంజనేయులు, సర్పంచ్‌ పార్వతమ్మ, రాజేశ్వర్‌, గోపాల్‌రెడ్డి, పీఈటీ అంజన్న తదితరులు పాల్గొన్నారు.

హన్వాడ: మండలంలో ముగింపు కార్యక్రమంలో ఎంపీపీ బాల్‌రాజు క్రీడాకారులను అభినందించారు. తహసీల్దార్‌ బి.శ్రీనివాసులు, ఎంపీడీఓ ధనుంజయగౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సహించేందుకే : మంత్రి

జడ్చర్ల: గ్రామీణ స్థాయిలో ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎంకప్‌ పోటీలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్‌, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ తెలిపారు. బుధవారం స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో ఆయన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితో కలిసి సీఎం కప్‌ క్రీడలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు క్రీడాకారులను పరిచయం చేసుకుని మరింతగా క్రీడలలో రాణించి, మంచి పేరు తీసుకురావాలని సూచించారు. మండల స్థాయిలో ఎంపిక అయిన వారు జిల్లా స్థాయికి ఆ తరువాత రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కబడ్డీ ఆడి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌ చైర్మన్‌ యాదయ్య, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ లక్ష్మి, ఎంపీడీఓ ఉమాదేవి, ఎంఈఓ మంజులాదేవి తదితరులు పాల్గొన్నారు.


హన్వాడలో..


జిల్లాకేంద్రంలో..


గండేడ్‌లో..


మిడ్జిల్‌లో..


రాజాపూర్‌లో..


మూసాపేటలో..

ఫైరింగ్‌లో నైపుణ్యం అవసరం

జడ్చర్ల: పోలీసులకు క్రమశిక్షణ, కవాతు ఎంత ముఖ్యమో అదేవిధంగా ఫైరింగ్‌ కూడా అంత ముఖ్యమని ఎస్పీ నరసింహ అన్నారు. ఫైరింగ్‌లో నైపుణ్యం సాధించాలని తెలిపారు. ఆయన జడ్చర్ల డీటీసీలో బుధవారం యాన్యువల్‌ ఫైరింగ్‌ కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో ఏఆర్‌ అదనపు ఎస్పీ సురేష్‌ కుమార్‌, ఏఆర్‌ డీఎస్పీ శ్రీనివాసులు, డీఎస్పీలు మహేశ్‌, రామారావు, డీటీసీ సీఐ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

మొరాయించిన ఎస్కార్ట్‌ వాహనం

జడ్చర్ల: రాష్ట్ర ఎక్సైజ్‌ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ ఎస్కార్ట్‌ వాహనం బుధవారం మొరాయించింది. జడ్చర్ల శివారులోని ఓ వెంచర్‌ ప్రారంభోత్సవానికి ఆయన స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితో కలిసి తన వాహనంలో వెళ్లారు.ఈ సమయంలో ఆయనకు రక్షణగా వెనుక వెళ్తున్న ఎస్కార్ట్‌ వాహనం దారిలో ఒక్కసారిగా ఆగి పోయి మొరాయించింది. కాగా సిబ్బంది వాహనాన్ని చేతులతో ముందుకు నెడుతూ స్టార్ట్‌ చేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. దీంతో మెకానిక్‌ను రప్పించి మరమ్మత్తు చేసి వాహనాన్ని తీసుకెళ్లారు.

రామలింగేశ్వరుడి సన్నిధిలో జేసీ కుటుంబ సభ్యులు

అడ్డాకుల: మండలంలోని కందూర్‌ రామలింగేశ్వరస్వామిని బుధవారం జాయింట్‌ కలెక్టర్‌ సీతారామరావు కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. ఆలయ పూజారులు వారికి ఘనస్వాగతం పలికి ప్రధాన ఆలయంలోని శివలింగానికి అభిషేకం, పూజలు చేయించారు. తర్వాత గౌరమ్మను దర్శించుకుని ఆలయ ఆవరణలో ఉన్న కల్పవృక్షం చుట్టూ వారు ప్రదక్షిణలు చేశారు. అనంతరం వారిని పండితులు సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ కిషన్‌, డిప్యూటీ తహసీల్దార్‌ నర్ర శ్రీనివాస్‌, సర్పంచ్‌ శ్రీకాంత్‌, ఆలయ చైర్మన్‌ రమేష్‌గౌడ్‌, ఈఓ రాజేశ్వరశర్మ ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

జడ్చర్ల: స్థానిక రైల్వే స్టేషన్‌ సమీపంలో మంగళవారం రాత్రి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన మహిళ హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు..రంగారెడ్డి జిల్లా షాబాద్‌కు చెందిన వడ్డె యాదమ్మ(41) జడ్చర్ల స్టేషన్‌లో రైలు ఎక్కేందుకు వచ్చిన సమయంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొంది. వెంటనే ఆమెను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఉస్మానియాకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

‘రైల్వే గేటు మూయకుండా ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నారు’

దేవరకద్ర: ఆర్వోబీ ప్రారంభం అయిన తరువాత దేవరకద్ర రైల్వే గేటును మూయకుండా ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు జట్టి నర్సింహారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్వోబీ ప్రారంభించిన రోజే జిల్లా కలెక్టర్‌, మంత్రుల దృష్టికి తీసుకువెళ్లారని అన్నారు. ఇప్పటికే ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి తన లేటర్‌ ప్యాడ్‌పై దక్షిణ మధ్య రైల్వే జనరల్‌ మేనేజర్‌కు లెటర్‌ పంపించారని, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కూడ గేటు విషయంలో మాట్లాడుతున్నారని వివరించారు.

నియంత్రికల ఏర్పాటు

హన్వాడ: మండలపరిధిలోని పల్లెమోనికాలనీ– పిల్లిగుండుతండాల మధ్య ప్రధానరహదారిపై ప్రమాదాల నివారణకు నియంత్రికలను బుధవారం ఏర్పాటు చేశారు. సర్పంచ్‌ పల్లెమోని వెంకటమ్మ సహకారంతో ఏర్పాటు చేసిన నియంత్రికలను ఎస్‌ఐ రవినాయక్‌ సందర్శించి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ వెంకటమ్మను ఎస్‌ఐతో పాటు పలువురు అభినందించారు. గ్రామ పెద్దలు రాజుయాదవ్‌, జగన్‌నాయక్‌, సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

పీపుల్స్‌ మార్చ్‌లో అపశ్రుతి

నవాబుపేట: భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్‌ మార్చ్‌ పాదయాత్రలో అపశ్రుతి చోటు చేసుకుంది. నవాబుపేటలో బాణాసంచా కాల్చటంతో నిప్పురవ్వలు ఎగిసిపడి రోడ్డుపక్కనే ఉన్న కేశవులుకు చెందిన ఫర్నిచర్‌ దుకాణం పాక్షికంగా దగ్ధమైంది. అక్కడి వారు మంటలను ఆర్పి కొంత ఫర్నిచర్‌ కాపాడారు. కాగా అప్రమత్తం కావడం వల్ల ఎక్కువ నష్టం జరగలేదని, లేకపోతే చాలా పెద్ద ఎత్తున ప్రమాదం జరిగేదని పలువురు అభిప్రాయపడ్డారు.


నియంత్రికల వద్ద ఎస్‌ఐ తదితరులు

ఈర్ల నర్సింహ మృతి పార్టీకి తీరని లోటు

జెడ్పీసెంటర్‌(మహబూబ్‌నగర్‌): సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈర్ల నర్సింహ మృతి తమ పార్టీకి తీరని లోటని జిల్లా కార్యదర్శి బాల్‌కిషన్‌ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ పూర్తి చేసిన వెంటనే కమ్యూనిస్టు పార్టీలో కార్యకర్తగా చేరి పేద ప్రజల తరపున అనేక పోరాటాలు చేశారని తెలిపారు. ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా పార్టీ అభ్యున్నతి కోసం తన జీవితాంతం పాటు పడిన వ్యక్తి అని కొనియాడారు. 1980 నుంచి 2009 వరకు సర్పంచ్‌గా, ఎంపీటీసీగా బాధ్యతలు నిర్వహించినట్లు వివరించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని పేర్కొన్నారు.

నేడు చెక్కుల పంపిణీ

మహబూబ్‌నగర్‌ రూరల్‌ : మండలంలోని రామచంద్రాపూర్‌, ఫతేపూర్‌, జమిస్తాపూర్‌, దివిటిపల్లి, మాచన్‌పల్లి గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎంరిలీఫ్‌ ఫండ్‌ చెక్కులను మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ గురువారం అందజేయనున్నారు. లబ్ధిదారులు గురువారం ఉదయం 10 గంటలకు మంత్రి ఫామ్‌ హౌస్‌కు చేరుకుని చెక్కులు పొందాలని బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌ యాదవ్‌ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఎల్లమ్మ బోనాలు


బాలానగర్‌లో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

రాజాపూర్‌ : రాఘవాపూర్‌లో బుధవారం భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టిన ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు అలరించాయి. దోండ్లపల్లి ఎంపీటీసీ అభిమన్యురెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ శ్రీనివాస్‌, ఉపసర్పంచ్‌ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్‌ : మండల కేంద్రంలో గత రెండు రోజులగా సాగిన బొడ్రాయి ఉత్సవాలు జాతరను తలపించాయి. సర్పంచ్‌ విజయలక్ష్మి, గ్రామపెద్దలు అన్ని ఏర్పాట్లు చేశారు. బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమానికి ఎంపీ మన్నె శ్రీనివాస్‌ రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్‌, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అనిరుధ్‌ రెడ్డి, బీజేపీ నాయకురాలు బాలాత్రిపురా సుందరీ దేవీ, డీసీఎంఎస్‌ చైర్మన్‌ ప్రభాకర్‌ రెడ్డి, సామాజికవేత్త అభిమన్యు రెడ్డి తదితరులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌, వైస్‌ ఎంపీపీ వారిని ప్రత్యేకంగా సన్మానించారు. అదేవిధంగా సాయంత్రం జరిగిన బోనాల వేడుకలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


రాఘవాపూర్‌లో..

కిటకిటలాడుతున్న ఈత కొలనులు


జిల్లా ప్రధాన స్టేడియంలో స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొడుతున్న చిన్నారులు, యువకులు



మహబూబ్‌నగర్‌ క్రీడలు: వేసవిలో ఎండలు మండుతున్నాయి. ఉదయం నుంచే ఎండ వేడిమి ఎక్కువగా ఉండడంతో బయటకు అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. ఎండ తాపం నుంచి ఉపశమనం పొందడానికి ప్రజలు వివిధ మార్గాలను ఆశ్రయిస్తున్నారు. కొంతమంది యువత, చిన్నారులు ఈతకొట్టడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. పట్టణంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన ఈత కొలనుల(స్విమ్మింగ్‌పూల్‌)ను ఆశ్రయిస్తున్నారు. దీంతో ప్రస్తుతం ఈత కొలనులు కిటకిటలాడుతున్నాయి. వీటిల్లో కాకపోతే గంటపాటు ఈత కొట్టడానికి, నెల రోజుల ప్రకారం అంటూ వేరువేరు రకాలుగా రుసుం చెల్లించాల్సిఉంటుంది. కాగా ఈత కొట్టడం వల్ల వేసవి తాపం నుంచి ఉపశమనంతో పాటు ఆరోగ్యంగా ఉంటామని, శరీరంలో ఉండే అనవసర కొవ్వు కరుగుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. అంతేకాకుండా ఆకలి, చురుకుదనం, జ్ఞాపకశక్తి వృద్ధి చెందుతాయని, మధుమేహం, గుండె సంబంధ వ్యాధులు అదుపులో ఉంటాయి. 30 నిమిషాల పాటు ఈతకొడితే సుమారు 300 క్యాలరీలు ఖర్చవుతాయని అంటున్నారు.

మెయిన్‌ స్టేడియం స్విమ్మింగ్‌పూల్‌లో సందడి...

జిల్లా కేంద్రంలోని యువజన, క్రీడాశాఖకు సంబంధించిన మెయిన్‌ స్టేడియంలోని ఈతకొలను (స్విమ్మింగ్‌పూల్‌)కు పిల్లలు పెద్దలు, యువకులు వెళ్తున్నారు.ఉదయం 7 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు స్విమ్మింగ్‌పూల్‌ నిర్వహిస్తున్నారు. మెయిన్‌ స్టేడియంలో స్విమ్మింగ్‌పూల్‌లో ప్రతి రోజు దాదాపు 300 మంది చిన్నారులు, యువత విడతల వారీగా ఈత కొడుతున్నారు. అంతేకాకుండా ఇక్కడ చిన్నారులకు ప్రత్యేకంగా ఈతలో శిక్షణ అందజేస్తున్నారు. కోచ్‌ల సహాయంతో పూల్‌లో మూడు అడుగుల లోతు వద్ద చిన్నారులకు ఈత నేర్పిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

- ఈత కొట్టేముందు స్నానం చేయాలి.
- స్విమ్‌సూట్స్‌, క్యాప్స్‌, గాగుల్స్‌, ట్యూబ్‌లు తప్పనిసరిగా ధరించాలి
- ఈత రాని వారి వెంట ఎవరో ఒకరు తప్పనిసరిగా ఉండాలి.
- చిన్నపిల్లలు కోచ్‌ పర్యవేక్షణలో ప్రాక్టీస్‌ చేయాలి.
- తల వెంట్రుకలు రాలకుండా క్యాప్‌ వాడాలి.
- ఈత కొట్టిన తరువాత మళ్లీ స్నానం చేయాలి.

చిన్నారులకు నేర్పిస్తున్నాం

నెల రోజుల్లో స్విమ్మింగ్‌పూల్‌లో ఆరు మంది కోచ్‌ల ద్వారా ఇప్పటివరకు చాలా మంది చిన్నారులకు ఈత నేర్పించాం. చాలా మంది నేర్చుకోవడానికి ఉత్సాహం చూపుతున్నారు. మహిళలు కూడా ఈత కొట్టేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. వేసవిలోనే కాకుండా సంవత్సరమంతా స్విమ్మింగ్‌పూల్‌ను అందుబాటులో ఉంచుతాం. త్వరలో చిన్నారులు, యువతకు ఈత పోటీలు నిర్వహిస్తాం.

– మహ్మద్‌ జాహెద్‌,
స్టేడియం స్విమ్మింగ్‌పూల్‌ నిర్వాహకుడు

ఈత కొట్టడం నేర్చుకుంటున్నా...



నెల రోజుల నుంచి ఈత కొట్టడం నేర్చుకుంటున్న. మొదట 15 రోజులపాటు ట్యూబ్‌ సహాయంతో ఈత కొట్టడం నేర్చుకున్న. ఇప్పుడు ట్యూబ్‌ లేకుండా ఈత కొడుతున్న. సిమ్మింగ్‌ చేస్తుంటే చాలా సంతోషమనిపిస్తుంది.

– సయిదా అయిజా,
మహబూబ్‌నగర్‌

15 రోజుల నుంచి వస్తున్న



గత 15 రోజుల నుంచి స్టేడియంలో స్విమ్మింగ్‌ చేయడానికి వస్తున్న. నేర్చుకుంటుంటే చాలా సంతోషం కలుగుతోంది. ఇక్కడ చాలాబాగా స్విమ్మింగ్‌ చేయడం నేర్పిస్తున్నారు.

– అక్షయ్‌,
మహబూబ్‌నగర్‌

‘మంత్రిని బద్నాం చేయడం సరికాదు’


మాట్లాడుతున్న మల్లెపోగు శ్రీనివాస్‌

మహబూబ్‌నగర్‌ రూరల్‌: పాలమూరును అన్ని విధాలా అభివృద్ధి చేయాలనే ఆకాంక్షతో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ ముందుకెళ్తుంటే కొందరు కావాలనే అడ్డుకోవాలని ప్రయత్నించడం ఎంతవరకు సమంజసమని ఎమ్మార్పీఎస్‌ (టీఎస్‌) రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ మల్లెపోగు శ్రీనివాస్‌ అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితుల ఆత్మగౌరవం దెబ్బతీసేలా సామాజిక మాధ్యమాల్లో వీడియోలు పెట్టి వైరల్‌ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. ఈనెల 6న వెనుకబడిన మహబూబ్‌నగర్‌ అభివృద్ధిపై మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ బీజేపీ, కాంగ్రెస్‌ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను ఉద్దేశించి మాట్లాడిన మాటలను కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా వక్రీకరించారని అన్నారు. దళితులు థర్డ్‌ క్లాస్‌ వాళ్లు అని మంత్రి అన్నారని అసత్య ప్రచారం చేశారని ఆరోపించారు. దళితుల ఆత్మగౌరవం దెబ్బతీసేలా వీడియోలు వైరల్‌ చేశారని, కొందరు కావాలనే రాజకీయంగా, వ్యక్తిగతంగా ఇలాంటి దాడులు చేస్తున్నారని వివరించారు. ఫేక్‌ వీడియోలు పెట్టి మంత్రిని బద్నాం చేయడం సరికాదని అన్నారు. ఒకవేళ నిజంగా కించపరిచే వ్యాఖ్యలు మంత్రి చేసి ఉంటే ఇప్పటికే దళిత సంఘాలు, నాయకులు స్పందించేవారని, వాస్తవాలు తెలుసు కాబట్టే మాట్లాడలేకపోయారని అన్నారు. మంత్రిపై అసత్య ప్రచారాలను చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్‌, నాయకులు శ్రీను, జయన్న, రవి పాల్గొన్నారు.